ఉయ్యాలో ఉయ్యాలా...

బాలకృష్ణ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'భగవంత్ కేసరి'. అనిల్ రావిపూడి దర్శకుడు. షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గారపాటి, హరీష్ పెద్ది నిర్మిస్తున్నారు. అక్టోబర్ 19న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలోని రెండో గీతం 'ఉయ్యాలో ఉయ్యాలా' ఈ నెల 4న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఆదివారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో బాలకృష్ణ నది ఒడ్డున కూర్చొని పాపతో సరదాగా నవ్వుతూ కనిపిస్తున్నారు. బాబాయ్, కూతురు మధ్య అనుబంధం నేపథ్యంలో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారని తెలిసింది. కూతురు శ్రేయస్సు కోసం ఎంత దూరమైనా వెళ్లే ఓ బాబాయ్ కథ ఇదని, యాక్షన్‌తో పాటు హృదయాన్ని కదిలించే భావోద్వేగాలుంటాయని చెబుతున్నారు. బాలకృష్ణ కూతురు పాత్రలో శ్రీలీల నటిస్తున్నది. కాజల్ అగర్వాల్, అర్జున్ రాంపాల్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సి.రామ్‌ప్రసాద్, సంగీతం: తమన్, రచన-దర్శకత్వం: అనిల్ రావిపూడి.

వితంతువు కథలో..

అగ్ర కథానాయిక శృతిహాసన్‌కు ఈ ఏడాది బాగా కలిసొచ్చింది. సంక్రాంతి సీజన్‌లో వీరసింహా రెడ్డి, వాల్తేరు వీరయ్య చిత్రాలతో మంచి విజయాలను దక్కించుకుంది. ఆమె ప్రధాన పాత్రలో నటించిన తాజా ఇంగ్లీష్ చిత్రం 'ది ఐ'. డాఫేష్మోన్ దర్శకత్వం వహించారు. పలు అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్స్‌లో నామినేట్ అయిన ఈ చిత్రం తన కెరీర్‌లోనే ప్రత్యేకమని చెబుతున్నది శృతిహాసన్. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 'ఈ సినిమా గ్రీక్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ స్క్రీనింగ్స్‌లో దర్శకత్వం, సినిమాటోగ్రఫీ విభాగాల్లో నామినేట్ అయింది. లండన్ ఇండిపెండెంట్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో చోటు దక్కించుకుంది. కోర్బ అనే దీవుల్లో ఈ సినిమాను చిత్రీకరించాం. 1980 దశకంలో కథ నడుస్తుంది' అని చెప్పింది. భర్త మరణించిన ద్వీపానికి అతని చితాభస్మంకోసం వెళ్లిన యువ వితంతువు కథ ఇది. సైకలాజికల్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఇదిలావుండగా ప్రభాస్ సరసన శృతిహాసన్ నటించిన 'సలార్' చిత్రం డిసెంబర్ 22న ప్రేక్షకుల ముందుకురానున్న విషయం తెలిసిందే. నాని 'హాయ్ నాన్న' చిత్రంలో కూడా ఈ భామ కీలకమైన పాత్రను పోషిస్తున్నది.

మెగా సీక్వెల్ పనిలో త్రివిక్రమ్?

'ఈ జన్మ పగ కోసం.. వచ్చే జన్మ నీకోసం' అనే డైలాగ్‌తో చిరంజీవి 'ఖైదీ' సినిమా ముగుస్తుంది. ఈ డైలాగ్‌ని పట్టుకొని, అక్కడ్నుంచి ఓ కొత్త కథ తయారు చేసేయొచ్చు. 'ఖైదీ'కి సీక్వెల్ అన్నమాట. ఎవరు చేస్తారనుకుంటున్నారా? చిరంజీవే చేస్తారు. కథ బాగుండి..సరైన దర్శకుడు దొరికితే మెగాస్టార్ మాత్రం ఎందుకు వెనకాడతారు? ఈ ప్రాజెక్ట్ నిజమైతే బావుండు అనిపిస్తున్నది కదా. వాతావరణం చూస్తుంటే అలానే ఉంది. అవును.. ఇటీవలే ఈ విషయంపై చిరు, త్రివిక్రమ్ కలిశారట. 'ఖైదీ' సీక్వెల్ బాధ్యతను త్రివిక్రమ్‌కు అప్పజెప్పారట మెగాస్టార్. ఫిలింవర్గాల్లో ఈ వార్త బాగానే వైరల్ అవుతున్నది. 1983లో విడుదలైన 'ఖైదీ' ఎంతటి విజయాన్ని సాధించిందో తెలిసిందే. ఈ సినిమాతోనే చిరంజీవి స్టార్ హీరో అయ్యారు. ఇప్పుడు ఆయన 'ఖైదీ' సీక్వెల్ చేస్తే అది నిజంగా అభిమానులకు గొప్ప వార్తే. పైగా దర్శకుడు త్రివిక్రమ్ అంటే అంచనాలు ఆకాశంలో ఉంటాయి. ప్రస్తుతం ఆయన మహేశ్‌తో 'గుంటూరుకారం' చేస్తున్నారు. ఆ తర్వాత అల్లు అర్జున్ సినిమా ఉంటుంది. ఈ రెండు సినిమాల తర్వాత ఈ సినిమా ఉండొచ్చని టాక్. చిరంజీవి కూడా తన ప్రాజెక్టులతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. మరి ఈ 'ఖైదీ' సీక్వెల్ విషయంలో నిజం ఎంతుందో తెలుసుకోవాలంటే ఇంకొన్ని రోజులు ఆగాల్సిందే.

డిజిటల్ హక్కులు 270కోట్లు?

రామ్‌చరణ్ 'గేమ్‌ఛేంజర్' కోసం మెగా అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. కొన్ని కారణాలవల్ల సినిమా ఆలస్యం అవుతుండటంతో అభిమానులు కాస్త నిరాశగా ఉన్నారు. అయితే.. వారందరికీ ఆనందాన్ని పంచే ఓ అప్‌డేట్ బయటకొచ్చింది. 'గేమ్ ఛేంజర్' షూటింగ్ 75శాతం పూర్తయిందని మేకర్స్ చెబుతున్నారు. పాటలు, యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ మాత్రమే మిగిలివుందట. వాటిని పూర్తి చేసి సాధ్యమైనంత త్వరలో సినిమా విడుదల చేయాలని దర్శకుడు శంకర్, నిర్మాత దిల్‌రాజు నిర్ణయించుకున్నట్టు సమాచారం. మరో విషయం ఏంటంటే.. ఈ సినిమా డిజిటల్ హక్కులు 270కోట్లకు అమ్ముపోయాయని తెలుస్తున్నది. దీన్నిబట్టి ఈ సినిమా రేంజ్ ఏంటో అర్థంచేసుకోవచ్చు. కియారా అద్వాణీ ఇందులో కథానాయికగా నటిస్తున్న సంగతి తెలిసిందే.

ప్రఖ్యాత నటుడు, దివంగత డా॥ అల్లు రామలింగయ్య 101వ జయంతి వేడుకలను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్‌లోని అల్లు బిజినెస్ పార్క్‌లో అల్లు రామలింగయ్య కాంస్య విగ్రహాన్ని అల్లు అర్జున్ కుమారుడు అయాన్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అగ్ర నిర్మాత అల్లు అరవింద్, శిరీష్, కొణిదెల సురేఖతో పాటు పలువురు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సంక్రాంతికి 'లాల్ సలాం'

సూపర్‌స్టార్ రజనీకాంత్ కీలక పాత్రలో నటిస్తున్న చిత్రం 'లాల్ సలాం'. విష్ణు విశాల్, విక్రాంత్ కథానాయకులు. ఐశ్వర్య రజనీకాంత్ దర్శకత్వం వహిస్తున్నారు. లైకా ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్నది. ఈ చిత్రాన్ని సంక్రాంతికి విడుదల చేయబోతున్నట్లు నిర్మాణ సంస్థ ప్రకటించింది. ఈ సినిమాలో రజనీకాంత్ ముంబయి మాఫియా డాన్ మొయిద్దీన్ భాయ్‌గా కనిపించనున్నారు. కొద్ది రోజుల క్రితం విడుదల చేసిన ఆయన ఫస్ట్‌లుక్‌కు మంచి స్పందన లభించింది. క్రికెట్ నేపథ్యంలో మాఫియా ఇతివృత్తంతో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. క్రికెట్ లెజెండ్ కపిల్‌దేవ్ ఓ పాత్రను పోషించారు. ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల చేయబోతున్నారు. ఈ చిత్రానికి కెమెరా: విష్ణు రంగస్వామి, సంగీతం: ఏ.ఆర్.రెహమాన్, సమర్పణ: సుభాస్కరన్, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: ఐశ్వర్య రజనీకాంత్.

'జై విఠలాచార్య' పుస్తకావిష్కరణ

జానపద బ్రహ్మ బి.విఠలాచార్య దర్శకత్వం వహించిన సినిమా విశేషాలను నేటితరం ప్రేక్షకులకు సమగ్రంగా పరిచయం చేస్తూ సీనియర్ సినీ జర్నలిస్ట్ పులగం చిన్నారాయణ 'జై విఠలాచార్య' పుస్తకాన్ని రచించారు. మూవీ వాల్యూమ్ మీడియా ఆధ్వర్యంలో షేక్ జీలాన్ బాషా ఈ పుస్తకాన్ని ప్రచురించారు. ఆదివారం ప్రముఖ దర్శకులు త్రివిక్రమ్ చేతుల మీదుగా ఈ పుస్తకావిష్కరణ జరిగింది. తొలి ప్రతిని రైల్వే ఉన్నతాధికారి రవి పాడి అందుకున్నారు. ఈ సందర్భంగా త్రివిక్రమ్ శ్రీనివాస్ మాట్లాడుతూ 'చరిత్రను రికార్డ్ చేయడం తెలుగులో చాలా తక్కువ. ముఖ్యంగా తెలుగు సినిమా చరిత్ర తక్కువగా అందుబాటులో ఉంది. జానపదబ్రహ్మగా అభివర్ణించే విఠలాచార్య జీవిత ప్రస్థానాన్ని నేటితరానికి తెలియజేసే ఈ ప్రయత్నం అభినందనీయం' అన్నారు. 'ఈ పుస్తకం కోసం పలువురు సినీ ప్రముఖులను ఇంటర్వ్యూలు చేయడంతో పాటు విఠలాచార్య కుటుంబ సభ్యులతో మాట్లాడి ఎన్నో విషయాలను సేకరించా. ఇప్పటివరకు ఎక్కడా అందుబాటులో లేని విస్తృత సమాచారాన్ని ఈ పుస్తకలో పొందుపరిచాను' అని రచయిత పులగం చిన్నారాయణ తెలిపారు.

మంచి మనసును చాటుకున్న సితార

పోలికల్లోనే కాదు, బుద్ధిలోనూ తండ్రి మహేశ్‌కి జిరాక్స్ సితార. అవకాశం దొరికినప్పుడల్లా తనలోని సేవానిరతిని చాటుతూనే ఉంది. ఆ మధ్య ఓ నగల దుకాణానికి సంబంధించిన యాడ్‌లో నటించి, తద్వారా వచ్చిన మొత్తాన్ని ఛారిటీకి ఇచ్చేసింది. అలాగే.. తన పుట్టిన రోజు సందర్భంగా అనాథ పిల్లలకు సైకిళ్లు పంచింది. ఇలా చిన్నవయసులో మంచి పనులు చేస్తూ తండ్రికి తగ్గ తనయ అనిపించుకుంటున్నది సితార. ఇటీవల హైదరాబాద్‌లోని ఓ వ్యాపారసంస్థ, దసరా సందర్భంగా ఏర్పాటు చేసిన బొమ్మల కొలువుకు అతిథిగా వెళ్లింది సితార. ఆ కార్యక్రమంలో పేదలకు, వృద్ధులకు బహుమతులు అందజేసింది. ఈ నేపథ్యంలో స్టేజ్‌పైకి రాలేకపోతున్న వృద్ధులను, చేయి పట్టుకొని మరీ తీసుకొచ్చి బహుమతులిప్పించింది. చిన్న వయసులో ఇంతటి పెద్దమనసు చూసి మురిసిపోయి సితారను ప్రశంసల్లో ముంచెత్తారు. హీరోయిన్‌గా చేస్తావా? అని అడిగితే 'నాకు సినిమాలంటే ఇష్టం. నేను నటించేదీ లేనిదీ నాన్న ఇష్టం. ఒకటిమాత్రం నిజం. ఇకపై నా సంపాదనలో ఫిఫ్టీ పర్సంట్ ఛారిటీలకే' అంటూ బదులిచ్చింది సితార. ఓవైపు తండ్రి మహేశ్ పిల్లలకు గుండె ఆపరేషన్లు చేయిస్తుంటే, మరోవైపు కూతురు సితార పేదలను ఇలా ఆదుకోవడం నిజంగా హర్షించదగ్గ విషయమే.

సితార

నేహాశెట్టి, కిరణ్ అబ్బవరం

సిక్సర్ కొట్టి చూపిస్తా

కిరణ్ అబ్బవరం, నేహా శెట్టి జంటగా నటిస్తున్న చిత్రం 'రూల్స్ రంజన్'. రత్నంకృష్ణ దర్శకుడు. ప్రముఖ నిర్మాత ఏం.ఎం.రత్నం సమర్పణలో దివ్యాంగ్ లవానియా, మురళీకృష్ణ వేమూరి నిర్మిస్తున్నారు. ఈ నెల 6న విడుదలకానుంది. శనివారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. దర్శకుడు మాట్లాడుతూ 'కాలేజీ పూర్తయిన తర్వాత జీవితం గురించి యువతరం తాలూకు ఆలోచనలను ఈ సినిమాలో ఆవిష్కరించాం. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా మెప్పిస్తుంది. దర్శకుడిగా నా తొలి సినిమా 'నీ మనసు నాకు తెలుసు' తర్వాత తెలుగులో 'ఆక్సిజన్' చేయడానికి 15ఏండ్లు పట్టింది. ఈ గ్యాప్‌లో నాన్నకు ప్రొడక్షన్‌లో సహకారం అందించా. నేను సిక్స్ కొట్టడానికి దొరికిన లాస్ట్‌బాల్ ఈ సినిమా అనుకుంటున్నా. తప్పకుండా కొట్టి చూపిస్తా' అన్నారు. పూర్తి వినోదాత్మకంగా సాగే చిత్రమిదని హీరో కిరణ్ అబ్బవరం తెలిపారు. తాను నిర్మించే ప్రతీ సినిమాలో సోషల్ మెసేజ్ ఉంటుందని, భవిష్యత్తులో కిరణ్ అబ్బవరంతో మరో సినిమా చేస్తానని, దానికి తానే దర్శకత్వం వహిస్తానని ఏం.ఎం.రత్నం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు అనుదీప్ కేవీ, హైపర్ ఆది తదితరులు పాల్గొన్నారు.

శివ, క్యాథలిన్

ఊరికి ఆత్మ ఉంటే..?

శివ కంఠమనేని, క్యాథలిన్ గౌడ జంటగా నటిస్తున్న చిత్రం 'మధురపూడి గ్రామం అనే నేను'. మల్లి దర్శకుడు. లైట్ హౌస్ సినీ మ్యూజిక్ పతాకంపై కేఎస్ శంకర్ రావు, ఆర్.వెంకటేశ్వర రావు నిర్మిస్తున్నారు. అక్టోబర్ 13న విడుదల కానుంది. దర్శకుడు మాట్లాడుతూ 'మనుషులకు ఆత్మ ఉన్నట్లే.. ఒక ఊరికి ఆత్మ ఉండి తన కథ తానే చెబితే ఎలా ఉంటుందనే కాన్సెప్ట్‌తో నడిచే చిత్రమిది. ఒంగోలు, చీరాల నేపథ్యంలో కథ నడుస్తుంది. ఆద్యంతం ఉత్కంఠను పంచుతూ సాగుతుంది. యాక్షన్ డ్రామాగా ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది' అన్నారు. భరణి శంకర్, సత్య, నూకరాజు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సురేష్ భార్గవ్, సంగీతం: మణి శర్మ, రచన-దర్శకత్వం: మల్లి.

సమాజంలో పరివర్తన కోసం..

రవితేజ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'టైగర్ నాగేశ్వరరావు'. వంశీ దర్శకుడు. అభిషేక్ అగర్వాల్ నిర్మాత. దసరా కానుకగా ఈ నెల 20న విడుదల కానుంది. ఈ సినిమాలో రేణూ దేశాయ్ కీలక పాత్రను పోషిస్తున్నది. సమాజంలోని దురాచారాలపై ప్రజలను చైతన్యవంతులను చేసిన హేమలత లవణం పాత్రలో ఆమె కనిపించనుంది. ఆదివారం రేణూ దేశాయ్ ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. ఇందులో ఆమె ఓ పసిబిడ్డను పట్టుకొని కనిపిస్తున్నది. 'కథాగమనంలో రేణూ దేశాయ్ పాత్ర చాలా కీలకంగా ఉంటుంది. సమాజంలో పరివర్తన కాంక్షించే మహిళగా ఆమె పాత్ర స్ఫూర్తివంతంగా సాగుతుంది' అని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: ఆర్.మది, సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్, రచన-దర్శకత్వం: వంశీ.